క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని విజయదుర్గాంబిక ఆలయ వార్షికోత్సవం సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకుడు కోడూరి వెంకటరత్నం, నారాయణ శర్మ అమ్మవారికి ప్రత్యేక సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహాన్న దానం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అన్న ప్రసాదం స్వీకరించారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

రాజానగరం: ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఔత్సాహికులైన మైనార్టీలకు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు) సబ్సిడీతో కూడిన రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కాకినాడ) సునీల్‌కుమార్ నుంచి తమ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయన్నారు. 21 నుంచి 55 ఏళ్లున్న మైనార్టీలు మీ–సేవ కేంద్రాలు లేదా ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రింట్‌ను ఇంటర్వ్యూ సమయంలో చూపించాలన్నారు. వివరాలకు 0884–2351483 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్సై నాగరాజు బాధ్యతల స్వీకరణ



కోరుకొండ : కొత్తగా కోరుకొండ పోలీసు స్టేషన్ ఎస్సైగా కూన నాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసు స్టేషన్ నుంచి బదిలీ అయి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శ్యామ్‌సుందర్ రాజమహేంద్రవరం టూటౌన్ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక సిబ్బంది శాలువా, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

సీతానగరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీడీఓ ఎం భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ రెండు అర్జీలను అందుకున్నారు. వెలుగు ఏపీఎంను సమాచార చట్టంలో సమాచారం అడిగానని, ఇంత వరకు ఇవ్వలేదని, అడిగిన సమాచారం ఇప్పించాల్సిందిగా చినకొండేపూడికి చెందిన మేడిశెట్టి సరస్వతి అర్జీని అందించారు. తన భూమిలో కొంత తక్కువ వచ్చిందని, రీ సర్వే చేసి తన భూమి ఇప్పించాలని కోరుతూ రఘుదేవపురానికి చెందిన జి.చిట్టెమ్మ మరో అర్జీని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, ఏఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని కొన్ని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పోలవరం కెనాల్ ఫీడర్ బ్రేకర్ నిర్మాణం కోసం మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారన్నారు. దీంతో పురుషోత్తపట్నం, రామచంద్రపురం, దేవీపట్నం మండలం నేలకోట గ్రామాలకు, అలాగే తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

కీలకంగా సాంకేతిక నిఘా వ్యవస్థ



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాజు

రాజానగరం: జాతీయ భద్రతలో సాంకేతిక నిఘా వ్యవస్థ కీలకపాత్రను పోషిస్తుందని ఎల్ అండ్‌టీ రక్షణ వ్యవస్థ సలహాదారు జీఎస్ఎన్ రాజు అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక మేథస్సు అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్ జరిగింది. సాంకేతిక నిఘా వ్యవస్థలు ప్రత్యర్థుల సైనిక సామర్థ్యాలు, కదలికలు, సాంకేతికతను పర్యవేక్షించడంలో తోడ్పడతాయన్నారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక నిఘా వ్యవస్థలు జాతీయ భద్రతతో ముడిపడి ఉన్నాయన్నారు. ప్రమాదాలను ముందుగానే గుర్తించి, చర్యలు తీసుకోవడంలో కీలకంగా నిలుస్తాయన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



ఎక్సైజ్ సిబ్బంది అదుపులో ఉన్న నిందితుడు

రంగంపేట: అచ్యుతాపురం గ్రామంలో సోమవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన పేరూరి నాగన్న నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశామన్నారు. అలాగే తొగర సత్తిబాబు నుంచి 200 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేశామని చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. తహసీల్దార్ కోసు అనసూయ వద్ద ఏడుగురు పాత నేరస్తులను బైండోవర్ చేసినట్టు చెప్పారు.

మామిడీలా..

- ఈదురు గాలులకు మామిడి చెట్లకు తీవ్ర నష్టం
- నేలరాలిన టన్నులకొద్దీ కాయలు
- బీమా వర్తించదంటున్న అధికారులు
- కుదేలవుతున్న కర్షకుడు

కోరుకొండ: మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేస్తున్న మామిడి కాయలు రుచికరంగా ఉంటాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే నష్టాల నుంచి గట్టెక్కేందుకు ఈ ఏడాది రైతులు బీమా చెల్లించారు. పది రోజుల క్రితం విపరీతమైన ఈదురు గాలుల కారణంగా టన్నుల కొద్దీ మామిడి కాయలు నేల రాలాయి. రైతులంతా బీమాపై ఆశలు పెట్టుకోగా, ఇదేమీ వర్తించదంటూ అధికారులు చావుకబురు చల్లగా చెప్పారు. దీంతో కంగుతినడం రైతుల వంతయింది. మండలంలోని నర్సాపురం, గాదరాడ, కణుపూరు. కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, రాఘవపురం, దోసకాయలపల్లి, గుమ్ములూరు, బుచ్చెంపేట, మధురపూడి తదితర గ్రామాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ఏడాది వాతావరణంలో మార్పుల కారణంగా దిగుబడి కూడా తగ్గింది. దీనికితోడు ఈదురు గాలులతో చెట్లకు నష్టం జరిగి, బాగా పెరిగిన, పెరుగుతున్న కాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

తప్పని నష్టం

రాజానగరం నియోజకవర్గం రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో 2,434 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. ఇక్కడ బంగినపల్లి, చెరకు రసం, కొత్తపల్లి కొబ్బరి, చిన్న రసాలు, హైదర్ సాహెబ్, పంచదార కల్తీ తదితర రకాల కాయలు సాగు చేస్తున్నారు. ఎకరం తోట నుంచి సుమారు ఆరు టన్నుల దిగుబడి రావాలి. ఈ ఏడాది వాతావరణ మార్పులతో రెండున్నర టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. అదికాస్తా ఈదురు గాలులకు నేల రాలడంతో తీవ్ర నష్టం మిగిలింది. తగ్గిన దిగుబడి ఓవైపు, వాతావరణ పరిస్థితులతో మరోవైపు రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది.



గాదరాడలో కూలిన మామిడి కొమ్మలు, నేల రాలిన కాయలు

బీమా చేయించినా..

పండ్ల తోటల రైతులు నష్టాల నుంచి బయటపడటానికి బీమాను ఎంచుకున్నారు. అధికారులకు ప్రీమియం చెల్లించారు. ఇందులో భాగంగా ఎకరం మామిడి తోటకు రూ.2,000, జీడిమామిడి తోటకు రూ.1,500 చొప్పున బీమా నిమిత్తం చెల్లించారు. ఫలితం మాత్రం దక్కలేదు. చెట్టు పూర్తిగా విరిగిపోతేనే బీమా వర్తిస్తుందని అధికారులు చెప్పడంతో రైతులకు నష్టాలే మిగిలాయి. చెట్ల కొమ్మలు విరిగిపోవడం, కాయలు నేల రాలడాన్ని ప్రామాణికంగా తీసుకుని బీమాను వర్తింపజేయాలని కోరుతున్నారు.

మే నెలలో బీమా వర్తింపు



మండలంలోని పలువురు రైతులు బీమా చేయించుకున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా కొందరికి నష్టాలొచ్చాయి. ఈ మండలం మెట్ట ప్రాంతం కావడంతో మామిడి తోటలు ఎక్కువ. వీరిలో కొందరు బీమా కట్టిన వారున్నారు. వాతావరణ ఆధారిత బీమా చేయించుకున్న వారి విషయమై మే నెలలో వాతావరణం, తేమ శాతం ఆధారంగా బీమా సంస్థ లెక్కిస్తుంది.

– రినీ, ఉద్యానవన అధికారి

వాతావరణ ఆధారిత బీమా



నర్సాపురం, గాదరాడ, కణుపూరు, సీతారామపురం గ్రామాల్లో పది రోజుల క్రితం వీచిన ఈదురు గాలుల కారణంగా 3,234 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి పంటకు నష్టం జరిగింది. ఎన్నో టన్నుల కాయలు నేలరాలాయి. చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. తోటలను కౌలుకు తీసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వీరిలో బీమా చేయించుకున్న రైతులకు పరిహారం అందించాలి.

– మారిశెట్టి తేజోనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్, నర్సాపురం

బాధితులకు జక్కంపూడి పరామర్శ



వెలుగుబందలో బాధితుడిని పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

రాజానగరం: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం పర్యటించారు. వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వెలుగుబంద, సీతారామపురం, తూర్పుగానుగూడెం, పల్లకడియం, రాజానగరం, కానవరం, రాధేయపాలెం, శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం, కొండగుంటూరుల్లో పర్యటించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్దతో పాటు, ఆయా గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు ఉన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

రాజానగరం: నరేంద్రపురంలో గ్రామ దేవత ముత్యాలమ్మవారి తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి అమ్మవారిని మహిళలు దర్శించుకున్నారు. బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు 300 మందికి పట్టు చీరలను అందజేశారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరన్న

రంగంపేట: విద్యార్థుల్లోని నిగూఢమైన సృజనాత్మక శక్తి, నైపుణ్యాలను వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ద్వారా వెలికితీయవచ్చని మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరసుందరరావు (వీరన్న) అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులు ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, బీజేపీ నాయకుడు మండవిల్లి గుప్తా, సీనియర్ నాయకుడు వీవీ మాణిక్యం తదితరులు ఈ శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. తదుపరి బాలల పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. విద్యార్థులు శతక పద్యాలు, బాలల గేయాలు ఆలపించారు.

దారి పునరుద్ధరణకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రంగంపేట: దారిని పునరుద్ధరించాలని కోరుతూ తహసీల్దార్ కోసు అనసూయకు వినతిపత్రం అందించినట్టు ఏపీ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈలకొలను పంచాయతీలోని అచ్యుతాపురం శివారు కొత్తపేట ప్రజలు రాకపోకలు సాగిస్తున్న దారిని గ్రామంలోని ప్రైవేటు వ్యక్తులు మూసివేశారని చెప్పారు. సమగ్ర సర్వే నిర్వహించి దారి పునరుద్ధరించాలన్నారు. పూర్వం నుంచి కొత్తపేట దళిత, ఇతర పేదలు రాకపోకలు సాగిస్తున్న దారిని సరిహద్దు రైతులు కంచె వేసి మూసేశారన్నారు. శ్మశానానికి కూడా ఇదే దారి నుంచి వెళ్లాలన్నారు. ఈ విషయంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కుట్టు మెషీన్లు, గొడుగుల పంపిణీ



కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పెదపూడి: సమాజంలో విస్తృతంగా జి.మామిడాడ లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తరిస్తున్నామని క్లబ్ మెంటార్ మండ రాజారెడ్డి తెలిపారు. జి.మామిడాడ గ్రామంలో సోమవారం లయన్స్ క్లబ్ ద్వారా ఇద్దరు పేద మహిళలకు కుట్టు మెషీన్లు, మెయిన్ రోడ్డు, వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవిలో ఎండలు పెరుగుతున్న సమయంలో వివిధ రకాల చిరు వ్యాపారులకు ఎండ నుంచి రక్షణ, ఉపశమనం కోసం గొడుగులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే మహిళలు ఉపాధి పొందేందుకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ద్వారంపూడి భాస్కరరెడ్డి, రాయుడు వీరరాఘవులు, రావాడ నాగు, అర్ఏఆర్‌కే చౌదరి, డీవీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి విద్యుత్ సమస్యలు

రాజానగరం: నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని తాడేపల్లిలో సోమవారం కలుసుకుని వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో వస్తున్న వ్యత్యాసాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కలవచర్లలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కు కోసం 11/33 కేవీ సబ్‌స్టేషన్‌ని ఏర్పాటు చేయాలన్నారు. పాతపడిన విద్యుత్ స్తంభాలు, వైర్లను మార్చి కొత్తవి వేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

అనారోగ్యం తాళలేక యువకుడి బలవన్మరణం

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్యాన్ని తట్టుకోలేక హుకుంపేట డీబ్లాక్ గౌతమీనగర్‌కు చెందిన ఆకుల శ్రీనివాసనాయుడు(21) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు, శ్రీనివాసనాయుడు డిప్లొమో సెకండియర్ డిస్‌కంటిన్యూ చేశాడు. మ్యారేజ్ ఈవెంట్స్ చేస్తున్నాడు. అతని తల్లి కువైట్‌లో పని కోసం వెళ్లడంతో, తాతయ్య, అమ్మమ్మ వద్ద శ్రీనివాసనాయుడు, అతడి అన్నయ్య ప్రవీణ్‌పాల్ ఉంటున్నారు. ఇటీవల శ్రీనివాసనాయుడు కు జ్వరం రావడంతో రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. వైద్యులు టైఫాయిడ్‌గా నిర్ధారించారు. సోమవారం అన్నయ్య డ్యూటీకి వెళ్లగా, తాతయ్య, అమ్మమ్మ హెల్త్ చెకప్ కోసం హాస్పిటల్‌కు వెళ్లారు. అనంతరం కడుపునొప్పి వస్తుందని శ్రీనివాసనాయుడు తన మేనత్తకు చెప్పాడు. ఆమె ఇంటికి వెళ్లి మజ్జిగ కలిపి తెచ్చేలోగా ఇంటి తలుపులు వేసి గడియపెట్టుకున్నా డు. ఎంతకూ తలుపులు తీయకపోవడంతో ఆమె కిటికీలోంచి చూడగా, గదిలో ఫ్యాన్‌కు చీర తో ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సాయంతో అతడిని తొలుత ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోమాడ బాధితులకు న్యాయం చేయాలి

- లేకపోతే అక్కడే ఇళ్ల నిర్మాణం
- కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఫిర్యాదు



కాకినాడలో కలెక్టర్ షణ్మోహన్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: దోమాడ గ్రామంలో గృహాలు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే అక్కడే మరలా ఇళ్లు నిర్మించుకుంటారని వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. కాకినాడలో సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, శెట్టిబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, దళిత బహుజన్ ఫ్రంట్ నాయకుడు చెంగలరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు గుబ్బల ఆదినారాయణ తదితరులు కలిశారు. దోమాడ గ్రామంలో గృహాల తొలగింపు, దౌర్జన్యకాండపై వివరించి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, ఈ ఘటన కలెక్టర్ దృష్టికి వెళ్లిందని, బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. 'బీజేపీ అంటే సిద్ధాంతాల పార్టీ, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరిని అడుగుతున్నాను, మీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దౌర్జన్యంగా అధికారులతో పేదల ఇళ్లు తొలగించారు. దీనిపై పార్టీపరంగా ఆ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేస్తారా?' అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే బీజేపీని తాకట్టు పెట్టినట్టేనని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో ఇళ్లు తొలగించే కార్యక్రమాన్ని అక్కడ బీజేపీ వ్యతిరేకిస్తుంటే, ఇక్కడ మాత్రం ఆ పార్టీ ఇళ్లు తొలగించే కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితుల్లో వీరవెంకట సత్యనారాయణ, నాగమణి స్పృహ కోల్పోయి పడిపోయారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, పార్లమెంటరీ నియోజకవర్గ బీసీసెల్ కన్వీనర్ కేతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం



సీతానగరం గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ సహాయ సంక్షేమాధికారి ఓఎన్ సురేష్‌బాబు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్‌బాబు, రిటైర్డ్ హెచ్‌ఎం బి.భాస్కరరావు, రఘుదేవపురం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి.రమాదేవి, ఉపాధ్యాయులు జి.శేఖర్, ఎస్ రామకృష్ణ విచ్చేసి, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సాయం

సీతానగరం: ఇండియన్ రెడ్‌క్రాస్ మండల శాఖ ఆధ్వర్యంలో వెలమపేట అగ్ని బాధిత కుటుంబాలకు వంట సామగ్రిని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సోమవారం అందించారు. వెలమపేటలో కోడూరి సన్యాసిరావు, రమణకు చెందిన తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సొసైటీ మండల శాఖ సభ్యులు డాక్టర్ సత్యం రమేష్‌బాబు మాట్లాడుతూ దాతలు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎస్ సుధాకర్, ఓఎన్ సురేష్‌బాబు, పి.శివ పాల్గొన్నారు.

పుంత రోడ్డు కోసం రైతుల వినతి



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

సీతానగరం: మండలంలోని రాపాక–చినకొండేపూడి–నాగంపల్లి పుంతరోడ్డు వేయాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు స్థానిక రైతులు వినతిపత్రం అందించారు. సోమవారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయానికి రైతులు వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ రాపాక రోడ్డు గొప్పు కావ నుంచి పుంత మార్గాన్ని ఆనుకుని 800 ఎకరాల పంట భూములు ఉన్నాయన్నారు. వీటిని పండించే సమయంలో ఇబ్బందులు పడుతున్నామని, ఎరువులు తీసుకువెళ్లాలన్నా, పంట తరలించాలన్నా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దీనిని జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉంచగా, పుంత రోడ్డుకు సర్వే చేయించాలని సూచించారని, ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించామన్నారు.

పహల్‌గాం మృతులకు ప్రత్యేక ప్రార్థనలు



పెదపూడిలో కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

పెదపూడి: జమ్ము–కశ్మీర్‌లోని పహల్‌గాం వద్ద పర్యాటకులపై ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పెదపూడి క్రీస్తు సంఘం పాస్టర్ ఎం.సూర్యారావు అన్నారు. పెదపూడి గ్రామంలో క్రీస్తు సంఘం వారు నిర్వహించిన సువార్త సభలు మూడో రోజు అదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పహల్‌గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన భారతీయులకు కొవ్వొత్తుల వెలిగించి నివాళులు అర్పించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉగ్రవాదాన్ని అరికట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, మేరా భారత్ మహాన్ అంటూ ఈ సందర్భంగా నినాదాలు చేశారు. భారత్ అన్ని మతాలకు నిలయమని, పరమత సహనం భారత్ సొంతమని పాస్టర్ సూర్యారావు అన్నారు. రాజ్యాంగం పౌరులకు తగిన భద్రత కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు పీఎస్ఆర్ జైపాల్, పత్తి రాజు, ఎస్.సాంసన్‌రాజు, ఎస్.ప్రభాకర్, పెదపూడి, బిక్కవోలు మండలాల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షులు ఎస్.జాన్‌డేవిస్, బిషప్ ఎంఎస్ సమర్పణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ రమ్యసుధకు అభినందన



రమ్యసుధను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌డీటీ ఉమెన్స్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లో తమ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ పాల్గొనడం అభినందనీయమని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి.పార్థసారథి ప్రశంసించారు. ఈ సందర్భంగా సోమవారం హైస్కూల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముంబైకి చెందిన ఎడ్యుక్రియేటర్ రీసెర్చ్ జర్నల్‌లో ఎన్ఈపీ 2020 ఏ గ్లోబల్ లీపు ఫర్ ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై రమ్యసుధ రాసిన వ్యాసానికి సర్టిఫికెట్‌తో పాటు, ఆమె సత్కారం పొందడం పాఠశాలకే గర్వకారణమని అభినందించారు. 281 మంది పరిశోధన పత్రాలు సమర్పించగా, వీరిలో 50 మందిని ఎంపిక చేశారని, ఇందులో తాను కూడా ఉండటం ఆనందంగా ఉందని రమ్యసుధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు సావిత్రి, బుల్లెమ్మ, స్వాతికుమారి, శేషుకుమారి, ఓమి ప్రసాద్, వరలక్ష్మి, గణేష్, చార్లెస్ అభినందించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

వీఎఫ్ఐ చైర్మన్ జక్కర్



జక్కర్‌ను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: వాలీబాల్ క్రీడలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ అవార్డు గ్రహీత, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ రామావతార్ జక్కర్ కోరారు. సోమవారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి అనేక మంది అంతర్జాతీయ క్రీడాకారులు, కోచ్‌లు ఉన్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మంచి క్రీడాకారులను గుర్తించి, వారిని రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి జిల్లా సంఘం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘ జిల్లా జనరల్ సెక్రటరీ కుంచే యశ్వంత్, ప్రెసిడెంట్ రవిరాజు, కార్యవర్గ సభ్యులు సత్కరించారు.